
# సినీ బేతాళ కథలు

## – డా. కె.వివేకానందమూర్తి





*ఒకప్పటి మిమిక్రీ ఆర్టిస్ట్, సినీనటుడు, సినీపత్రికా సంపాదకుడు, ఇప్పటికీ చక్కటి కథారచయిత, విదేశంలో తెలుగు వైద్యుడు.. డా.కె.వివేకానందమూర్తిగారు నెలకో సినీ బేతాళ కథ చెప్పడం ప్రారంభించారు. డాక్టర్‌గారి కలం నుంచి నెలకో బేతాళ కథ ..కౌముది పాఠకుల కోసం ప్రత్యేకం..!!*

### *- 16 -*

### *- బట్టకట్టి చూడు -*

**విక్రమార్కుడు విసుగు** చెందకుండా యీ నెలకూడా బేతాళుడి శవాన్ని తన భుజం మీద వేసుకుని మళ్ళీ నడకసాగించాడు.

"విక్రమార్కా! నీకు శ్రమ కలుగకుండా వుండేందుకు మరో కథ చెబుతాను. విను." అని బేతాళుడు ప్రారంభించాడు.

"బుడ్డి చెంచయ్య అని వొక నిర్మాత వున్నాడు. అతగాడు చిత్రం తర్వాత చిత్రం చొప్పున పరంపరగా త్వరత్వరగా తెలుగు చిత్రాలు తీస్తున్నాడు. కానీ అన్నీ వరసగా ఫెయిలైపోతున్నాయి. అయినా యింకా చిన్నచిన్న నిర్మాతల్ని పోగేసుకుని వూపిరి సలపకుండా చిత్రాలు తియ్యడం మానలేదు. తన చిత్రాలు యెందుకు ఫెయిలవుతున్నాయో అర్ధంకాక వొకరోజు తన అసిస్టెంట్ సోలమన్‌బాబుని అడిగాడు. అప్పుడు సోలమన్‌బాబు తన అభిప్రాయాన్ని విడమరిచి చెప్పాడు

'అయ్యా శ్రీ బుడ్డి చెంచయ్య గురూజీ! తెలుగు చిత్ర నిర్మాణంలోగాని, పాత్రల కేటాయింపులోగాని, కథల సెలక్షన్‌లోగానీ, సంగీత సౌరభ్యంలోగాని మీరూ మిగతా నిర్మాతల్లాగే చేస్తున్నారు, తీస్తున్నారు.

కథల గురించి కామెంట్ చైలేం. అన్ని సినిమాలకి వొకటే కథ.

సంభాషణల్ని సంభాషణలు అంటే చిన్న చూపవుతుంది. రైతుల్లా, తెలుగు తెలిసిన తెలుగువారంతా పురుగుల మందు తాగి చావాల్సిన యమా డైలాగ్స్. లుంగీలు తగలడిపోయే పంచ్‌లు.

సంగీతం గుండెల్లో తడారిపోయి, ఎడారిపోయిన చెవులకు వొయాసిచ్చు –'

సోలమన్‌బాబు కంటిన్యూ చేస్తున్నాడు.

'అయితే నాదొక్కటే చిన్న సజెషన్. మన చిత్రాల టైటిల్ కార్డ్స్ చివరిదాకా బాగనే వుంటున్నాయి, అయితే చివర్లోనే వస్తోంది పేచీ.

– సమ్మోహనా చిత్ర సమర్పించు – బావుంది.

- నటవర్గం పేర్లు అదుర్లు, - ర్యాపిడ్ హీరో, డాషింగ్ పిరమిడ్, అమెరికా క్రేజు బ్రతకడానికి చికాగో క్వీన్, సియాటిల్ సుందరి యిలా ఎన్నో -

ఇలా చివరిదాకా అన్ని పేర్లూ అనూహ్యమైన బిజియమ్‌తో అద్భుతం. కానీ చివర నిర్మాతల కార్డు పడేసరికి గ్లామర్ సన్నగిల్లుతోంది. నిర్మాతలు - బుడ్డి చెంగయ్య, గుడ్డి బసవన్న, దొంగా వీరన్న, గుడ్డి పెంటారావ్ - - యిలాంటి పేర్లతో పిక్చర్ బిగినింగ్‌లోనే ప్రేక్షకుడు నీరుకారిపోతున్నాడు. ఎవరి పేర్లు వారికి గొప్ప. కానీ యీ దిక్కుమాలిన పరిశ్రమను గ్లామర్ యేలుతోంది. అంచేత హీరో హీరోయిన్ల పేర్లు అటూ యిటూ మార్చినట్టే నిర్మాతల పేర్లు కూడా మార్చండి. ఈసారి సినిమా సక్సెస్ కాకపోతే నా తెగిపోయిన చెప్పు తీసుకుని కుట్టండి."

- అన్నాడు అసిస్టెంట్ సోలమన్‌బాబు. అంతా విని బుడ్డి చెంగయ్య - 'సూడు సోలమనూ, యిలాంటి యెదవాలోసన్లు వండేవంటే నిన్ను సోలోమన్ అంటే యెవడూ తోడులేని సింగిలెదవని సేసేస్తా' అని కసిరేసి, నిర్మాత బుడ్డి చెంగయ్య బుడ్డీ ఖాళీచేసుకుంటూ తన సమాధిలోకి జారిపోయాడు.

తెలుగు సినిమా సక్సెస్‌కి, కీ పాయింటు యేవిటా అని బుడ్డి తర్వాత బుడ్డి ఖాళీ చేస్తూ బుడ్డి చెంగయ్య తపస్సు చేశాడు. నేటి తెలుగు సినిమా పసలాగా, బుడ్డి చెంగయ్యకు అందిన అన్ని బుడ్లూ ఖాళీ అయి అగోచరం అయిపోయింది.

అన్ని సినిమాలూ అట్టర్ ఫ్లాపులయి, అన్ని బుడ్లూ అడుగంటిపోయి బుడ్డి చెంగయ్య నాలుక పిడచగట్టుకుపోయింది. అప్పుడు చెంగుడు ఆక్రోశించాడు. - 'హే భగవాన్! నేను శూన్యుణ్ణయిపోతున్నాను' - కనికరించు - అని. అప్పుడు తన యింటి యెదురుగా రోడ్డుమీద చింకి చొక్కాతో సైకిల్ తొక్కుకుంటూ, 'సోమతీగ, సోమతీగ' అని అరుస్తూ, బక్క చిక్కిన మానవాకారం కనబడింది బుడ్డి చెంగునకు. వెంటనే నిర్మాత బి.చెంగయ్య చెంగుచెంగున పరుగెత్తి సైకిల్ మీదున్న మానవుని ఆపి, 'బాబూ! గోంగూర అమ్ముకునే వారిని చూశాను, తోటకూర అమ్ముకునేవారిని చూశాను. పుదేనా, పాలకూర అమ్ముకునే వారిని చూశాను. కానీ సోమతీగ అమ్ముకునే మనిషిని చూడడం యిదే మొదటిసారి. విషయం చెప్పు' అని వేడుకుంటూ అడిగాడు.

అప్పుడు ఆ సైకిల్ శాల్తీ చిరునవ్వు నవ్వి తలపంకించి, 'బాబూ! మన పురాణేతిహాసములకు, మన భాషకు దూరమైన నీకు యీ సోమతీగ వొక మంచి తెలుగు సినిమా కథవలె తారసిల్లుట నీ పూర్వజన్మ సుకృతము. దేవతలు యీ సోమతీగను, చెఱుకు మిషన్‌లో చెఱుకుగడను పిండినట్లు పిండి సోమరసమును రాబట్టుదురు. పిమ్మట ఆ సోమరసమును గ్రోలుదురు. దేవతలకు సోమరసము మానవులకు బ్లూ లేబిల్ లేక గ్రీన్ లేబిల్ వంటిది. సోమరస తన్మయత్వము, వుత్తమ తెలుగు చిత్ర నేత్ర సంపదవంటిది.' అన్నాడు.

'కూరలమ్ముకునే వాడి గెటప్‌లో తెలుగు యింత సొచ్ఛంగా దంచేత్తున్నావేటి?' అడిగాడు బుడ్డి చెంగయ్య.

'మాది కరీంనగర్ బాబూ. మా వూరిలో తెలుగు యింకా సజీవంగా వుంది' - అని బదులిచ్చాడు సైకిలాయన.

'నీ దగ్గరున్న ఆ సోమతీగ కట్టంతా కావాలి నాకు - ఏవిమ్మంటావ్?' - అడిగాడు చెంగయ్య.

'ఏవిస్తారు?'

'ఎంత డబ్బు కావాలి?'

'నాకా? డబ్బా?' నవ్వాడు సైకిల్ శాల్తీ.

'నా బుడ్లన్నీ ఖాళీ. అర్జంటుగా నాకు సోమరసం కావాలి. నువ్వడిగినంత, లేకపోతే నాదగ్గరిప్పుడు వున్న డబ్బంతా యిస్తాను. నీ దరిద్రం తీరిపోతుది.'

'ఈ రోజుల్లో డబ్బుకి విలువ యెక్కడుంది బాబూ?'

'అయితే రోజూ నీకు కడుపారా భోజనం పెడతాను.'

'నాకు ఆకలైదు బాబూ! రాతిలో కప్పలా, పండు టెంకలో పురుగులా బతికేస్తాను.'

'మరి నీకేం కావాలో యేపుకు తినక సెప్పు!'

'చూశారుగా - నా చొక్కా బాగా చిరిగిపోయింది. మీ దగ్గర నాకు సరిపోయే వస్త్రాలు ఏవన్నా యివ్వండి. వొక వస్త్రం చిరిగిపోతే మరోటి ధరిస్తాను. వస్త్రాలిస్తే ఈ సోమతీగంతా మీకిచ్చేసి వెళ్ళిపోతాను.'

'సైకిలోడివి యిలా సాకిచ్చేత్తన్నావేంటి? డబ్బొద్దు. ఫుడ్డొద్దు. గుడ్డ కావాలా?'

'అవును సార్ - ముక్కోటి దేవతలు వస్త్రంలో వసిస్తారని తమకు తెలియందా? అలాంటి పవిత్ర వస్త్రాల్ని వొలిచేసి హీరోయిన్స్‌ని, స్త్రీ పాత్రల్ని చూపిస్తే దేవతలు హర్షిస్తారా? అందుకే తమ చిత్రాలు ఫెయిలవుతున్నాయి'

'ఆరి పిడుగా! సోమరసాన్ని మించిపోయే పాయింటేసావ్. యిక్కడే వుండు.' అని బుడ్డి చెంగయ్య యింట్లోకి పరిగెత్తి తన బట్టలన్నీ తెచ్చి, సైకిల్ శాస్త్రికిచ్చి, అతనికి సత్కారంగా వొక శాలువా కూడా కప్పాడు. సైకిల్ శాస్త్రి తృప్తిగా చిరునవ్వు విసురుతూ, తన దగ్గరున్న సోమతీగెల కట్టంతా బుడ్డి చెంగయ్యకిచ్చి, 'గుర్తుంచుకోండి బాబూ! డైలాగులు పంచ్ లక్ష్యంగా వుండకూడదు. పదుగురికీ పంచభక్ష్యంగా వుండాలి. అలాగే స్త్రీ పాత్రలు వస్త్రాలన్నీ పోగొట్టుకుని, మాన రక్షణకోసం మిగిలి పారేసిన పీలికలతో మెలికలు తిరుగరాదు.' అని విశాల నగరంలోకి కదిలాడు.

ఆపాదమస్తకం కృతజ్ఞతా వస్త్రం కప్పుకున్న నిర్మాత బుడ్డి చెంగయ్య అర్జంటుగా వొక సోమతీగ కొరికి వెనక్కి తిరిగి చూస్తే సైకిల్ శాస్త్రి కనబడలేదు.

'వార్నీ! అంత ఫాస్టా! - ఏటో, యేగం ఆడి సైకిల్దో, సోమతీగ కిక్కుదో తెల్దంలా' అనుకున్నాడు బుడ్డి చెంగయ్య.

-- అదీ కథ విక్రమార్కా! ఇప్పుడు చెప్పు! నిర్మాత బుడ్డి చెంగయ్యకు సోమతీగ దొరకడం ఏవిటి? అసలా సైకిల్ మీద కూరలమ్ముకునే శాస్త్రి సోమతీగ అమ్మడం ఏవిటి? ధనం, ఆహారం కాదని వస్త్రాలు కోరడం ఏవిటి? ఈ ప్రశ్నలకు నువ్వు తెలిసీ సమాధానం చెప్పకపోతే నీ తెలుగు సంతకెళ్ళి, నీకు తెలుగు సినిమా తెలుగు తెగులు అనే వైరస్ తగులుకుంటుంది -" అని బేతాళుడు ముగించాడు.

"బేతాళా! ధనాహారాల కంటే వస్త్రాల అవసరం సైకిలాయనే చెప్పారు. ఇంతకీ ఆ సైకిల్ ఆయన ఎవరోకాదు. సాక్షాత్తూ శ్రీ మహావిష్ణువు. తెలుగు సినిమా బతికి బట్టకట్టాలంటే దేవుడు దిగిరావల్సిందే!

వాసాంసి జీర్ణాని యథా విహాయ
నవాని గృహ్ణా తినరోపరాణి!
తథా శరీరాణి విహాయ జీర్ణాని
అన్యాని సంయాతినవానిదేహీ!!

- తెలివైన మానవుడు శిథిల వస్త్రాల్ని వదిలివేసి, వాడుటకు వీలగు కొత్త వస్త్రములను ధరించును. -

- అన్నారోయ్ గీతాచార్యులు శ్రీకృష్ణ భగవానుడు -" అని విక్రమార్కుడు సమాధానం చెప్పగానే, బేతాళుడు తన వస్త్రాలు సరిచూసుకుంటూ యెగిరి మళ్ళీ చెట్టెక్కేసాడు.

***(వచ్చేనెలలో మరోకథ)***

Post your comments